
నమస్తే తెలంగాణ
ములుగు
జయశంకర్ భూపాలపల్లి
5 | వరంగల్, ఆదివారం 6 అక్టోబర్ 2024 | MULUGU JAYASHANKAR BHUPALPALLY


# గాయత్రీ మాతగా భద్రకాళి

**కనులపండువగా కొనసాగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాలు**



కాళేశ్వరం : చంద్రఘంట అలంకరణలో పార్వతీ అమ్మవారు

వరంగల్, అక్టోబర్ 5 : దేవీ శరన్నవరాత్రోత్సవాల్లో మూడో రోజైన శనివారం ప్రసిద్ధ భద్రకాళీ ఆలయంలో అమ్మవారు గాయత్రీ మాత అలంకారంతో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం చంద్రఘంటా క్రమంలో సింహ వాహనం, సాయంత్రం మహిషాసురమర్దిని దుర్గా క్రమంలో గజ వాహనంపై ఊరేగారు. అమ్మవారి దర్శనం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరాగా, ఐఏఎస్ అధికారి గిరిజా శంకర్ పూజల్లో పాల్గొన్నారు.

**కాళేశ్వరంలో చంద్రఘంటా క్రమంలో..**

కాళేశ్వరం : కాళేశ్వరంలోని శ్రీ శుభానంద(పార్వతి), మహా సరస్వతి అమ్మవార్లు శనివారం చంద్రఘంటా మాతగా దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అర్చకులు గణపతి, లలితార్చన, పంచమి విశేష పూజలతో పాటు గణపతి, నవగ్రహ, రుద్ర పంచసూక్త, మూల మంత్ర చండీహోమం నిర్వహించగా, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.



గాయత్రీ మాత అలంకరణలో భద్రకాళీ అమ్మవారు

---



రిసార్టులో ఆకర్షణీయంగా నిర్మించిన గదులు

సండే స్పెషల్ SUNDAY SPECIAL

# రిసార్ట్.. రిలాక్స్

## ఓరుగల్లులో సరికొత్త కల్చర్

**ఒకప్పుడు నగర ప్రజలు సేద తీరాలంటే ఏ పార్కుకో, సినిమాకో వెళ్లేవారు. కుటుంబంతో కలిసి ఆనందంగా గడిపేవారు. ప్రస్తుతం పరిస్థితులు మారాయి. పట్టణీకరణ వేగంగా విస్తరిస్తున్నది. దీనికి తోడు డబ్బు సంపాదనే ధ్యేయంగా ప్రజలు ఉరుకులు, పరుగుల జీవితాన్ని గడుపుతున్నారు. ఎప్పుడో సేద తీరాలనుకుంటే సరైన ప్రదేశాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. పట్టణాల్లో ఖాళీ ప్రదేశాలు మాయమై కమర్షియల్ కాంప్లెక్స్‌లు వెలుస్తున్నాయి. పోనీ ఎక్కడికైనా టూర్ వెళ్దామంటే సెలవు దొరకక, సమయం సరిపోక ఆ ఆలోచనను విరమించుకుంటున్నారు. కనీసం వీకెండ్‌లోనైనా దగ్గరలోని పర్యాటక ప్రదేశాలకు వెళ్లేందుకు ప్లాన్ వేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలోనే కొందరు రిసార్ట్ కల్చర్‌ను పరిచయం చేస్తున్నారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ తర్వాతి నగరంగా.. విద్యా కేంద్రాలకు నెలవుగా ప్రసిద్ధి చెందిన వరంగల్ చుట్టూ అందమైన అలంకరణలు.. ఆహ్లాదకరమైన వాతావరణంతో వీటిని ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే నగరం వెలుపల వెలసిన 20 వరకు రిసార్ట్‌ల్లో సేద తీరేందుకు నగర ప్రజలు క్యూ కడుతున్నారు. పార్టీలు, శుభకార్యాలు జరుపుకొనేందుకు ఆసక్తి చూపుతున్నారు.**

*- హనుమకొండ సబర్బన్, అక్టోబర్ 5*

- వరంగల్ చుట్టూ ఏర్పాటవుతున్న రిసార్టులు
- ఇప్పటికే 20 వరకు వెలిసిన సేద తీరే కేంద్రాలు
- అందమైన అలంకరణలు.. ఆకట్టుకునే వాతావరణం
- సెలవు రోజుల్లో క్యూ కడుతున్న ప్రజలు
- పార్టీలు, శుభకార్యాలకు ఆసక్తి కనబరుస్తున్న జనం



రిసార్టులో నిర్మించిన స్విమ్మింగ్ పూల్

హైదరాబాద్ తర్వాత అతిపెద్ద నగరంగా పేరున్న వరంగల్ మరింత విస్తరిస్తున్నది. పెద్ద ఎత్తున విద్యా సంస్థలు ఏర్పాటవుతుండడంతో వీటిల్లో చదువుకునేందుకు దేశ, విదేశాల నుంచి విద్యార్థులు వస్తున్నారు. ఇవి కాకుండా ఐటీ పరిశ్రమలు, ఇతరత్రా వ్యాపార, వాణిస్య సంస్థలు తమ బ్రాంచ్‌లను ఇక్కడ ఏర్పాటు చేస్తున్నాయి. దీంతో ఇక్కడి వారితో పాటు వేల సంఖ్యలో ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపార వేత్తలు నగరంలో నివాసముంటున్నారు. వీరంతా కుటుంబాలతో సేద తీరేందుకు సెలవు దినాల్లో హైదరాబాద్‌కు పయనమవుతున్నారు. వీరి అవసరాలను పసిగట్టిన మామిడి తోటల యజమానులు రిసార్టుల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. వరంగల్ నగరానికి 20 కిలోమీటర్ల పరిధిలో సుమారు 600 ఎకరాల్లో పలువురు రైతులు, వ్యాపారులు, అధికారులకు సంబంధించిన మామిడి తోటలున్నాయి. వీటి ద్వారా ఏటా పంట మాత్రమే తీసుకునే వారు. ఆ తోటల్లోనే మరింత ఆదాయం కోసం మామిడి చెట్లను తొలగించకుండానే రిసార్టులను తీర్చిదిద్దుతున్నారు. స్విమ్మింగ్ పూల్స్, అందమైన గదులు, గ్రామీణ సంస్కృతి ఉట్టి పడే వాతావరణంతో ఆకట్టునేలా ఏర్పాట్లు చేస్తున్నారు. వ్యవసాయ పనిముట్లు, చిన్నారుల ఆట వస్తువులను అందుబాటులో ఉంచుతున్నారు. అందమైన పలు విగ్రహాలు, సువాసన వెదజల్లే పూల చెట్లు పెంచుతున్నారు. చిన్నచిన్న పార్టీలు, శుభకార్యాలు చేసుకునేందుకు వీలుగా హాళ్లను సైతం నిర్మిస్తున్నారు.



రిసార్టులో ఏర్పాటు చేసిన పాత తరం గుడిసె

**సెలవు దినాల్లో సందడే..**

నగరం చుట్టూ నిర్మించిన పలు రిసార్టుల వివరాలను సోషల్ మీడియా వేదికగా యాజమానులు ప్రచారం చేసుకుంటున్నారు. దీంతో సెలవులు, వీకెండ్‌ను ఎంజాయ్ చేసేందుకు నగర వాసులు అక్కడికి వెళ్తున్నారు. కొందరు కుటుంబాలతో జాలీగా గడిపి వస్తుండగా మరికొందరు స్నేహితులతో వెళ్లి వస్తున్నారు. ఇంకొందరు చిన్న చిన్న పార్టీలు చేసుకుంటుండగా, కొందరు బర్త్‌డేలు, ఎంగేజ్‌మెంట్లు తదితర శుభకార్యాలను ఇక్కడే ప్లాన్ చేసుకుంటున్నారు. కొన్ని ప్రైవేట్ కంపనీలు తమ వ్యాపార సమావేశాలను కూడా రిసార్టుల్లోనే నిర్వహిస్తున్నాయి. ప్రశాంతంగా, పచ్చని చెట్ల మధ్య ఆహ్లాదకరంగా ఉండే ఈ రిసార్ట్‌లకు ప్రాధాన్యత పెరుగుతున్నది. కొన్ని రిసార్టుల్లో రుచికరమైన ఆహారాన్ని కూడా అందిస్తున్నారు. ప్రస్తుతం ఇవి ప్రారంభ దశలోనే ఉండడంతో చార్జీలు కూడా తక్కువగానే ఉన్నట్లు చెబుతున్నారు.

**ఇప్పుడిప్పుడే అలవాటవుతున్నారు**



గతంలో వారాంతపు సెలవులను ఎంజాయ్ చేసేందుకు వందలాది మంది హైదరాబాద్‌కు వెళ్లేవారు. ప్రస్తుతం మన దగ్గర కూడా రిసార్టులు ఏర్పాటు కావడంతో ఇప్పుడిప్పుడే వచ్చేందుకు అలవాటు పడుతున్నారు. ప్రకృతిలో సేద తీరాలనుకునే వాళ్లు రిసార్టులను ఎంచుకుంటున్నారు. ఫంక్షన్ హాళ్లలో చేసుకునే శుభకార్యాలకు ఇలా వచ్చి అలా వెళ్తారు. ఇక్కడ మాత్రం బంధువులందరితో కలిసి రెండు, మూడు రోజులుండి వెళ్తున్నారు.

– పోలేపల్లి రాజిరెడ్డి, రిసార్ట్ యజమాని

---

# చీరెల్లేవ్.. పైసల్లేవ్ బతుకమ్మ ఆడుడెట్ల?

*ఆడబిడ్డలంటే ముఖ్యమంత్రికి ఇంత చిన్నచూపా?*

- వేడుకలకు వీధిలైట్లు, పారిశుధ్య ఏర్పాట్లు చేయరా?
- బ్లీచింగ్ పౌడర్ కొనడానికి, లైట్లు పెట్టడానికి నిధుల్లేవా?
- పండుగ నిర్వహణలో కాంగ్రెస్ సర్కారు తీరుపై మహిళల అసంతృప్తి



ఎంగిపూల బతుకమ్మ రోజున టేకుమట్ల మండలం పెద్దంపల్లిలో విద్యుత్ దీపాలు లేక చీకట్లోనే ఆడుకుంటున్న మహిళలు

**తెలంగాణ వచ్చిన తర్వాత కేసీఆర్ సర్కారు కొలువుదీరిన కాన్నుంచి ప్రతి యేడు బతుకమ్మ పండుగకు తీరొక్క రంగు చీరెలు తలా ఒకటి ఇచ్చేది. ఆడబిడ్డకు కానుక లెక్క ఇచ్చిండు అని చూసి మురిసిపోయేటోళ్లం. ఆడుకునేందుకు మంచి సౌలత్ చేసేది. వాడకట్టుకు, చెరువుల కాడ పెద్ద పెద్ద లైట్లు పెట్టేది. చెత్తాచెదారం లేకుంట గ్రామ పంచాయతోళ్లు అంతా సాఫ్ చేసి బ్లీచింగ్ పౌడర్ కొట్టి మంచిగచేసేది. సాయంత్రం కాంగనే అందరం రాత్రి పది గొట్టెదాంక దాంక సంబురంగా ఆడుకునేది. కానీ గీ కాంగ్రెస్ సర్కారు వచ్చినంక చీరెలియ్యలే, వాటికి బదులు ఇత్తనన్న రూ.500 సుత ఇయ్యలే.. మరి మేం పండుగెట్లు చేసుకునేది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారుకు బతుకమ్మ పండుగంటే పట్టింపు లేదా.. ఆడబిడ్డలన్నా ఇంత చిన్న చూపా? అంటూ పేద, మధ్యతరగతి మహిళలు ప్రశ్నిస్తూనే ఆవేదన, అసంతృప్తి వెళ్లగక్కుతున్నారు. చాలాచోట్ల ఎంగిలిపూల బతుకమ్మకు ముందు, ఆ తర్వాత విద్యుత్‌దీపాలు లేక చీకట్లోనే ఆడుకోవాల్సి పరిస్థితి వచ్చిందని గుర్తుచేస్తున్నారు.**

*- నర్సింహులపేట, అక్టోబర్ 5*

**చీరెకు బదులు రూ.500 ఎప్పుడిస్తరు?**



మహిళలకు చీరెకు బదులు రూ.500 ఇస్తామన్న సీఎం రేవంత్ రెడ్డి మాటలు నీటి మూటలుగానే మిగిలాయి. బతుకమ్మ పండుగ మొదలై ఐదు రోజులవుతున్నా పండుగ గురించి పట్టింపులేదు. లైట్లు సక్రమంగా లేవు, చీకటితో ఇబ్బందులు పడుతున్నాం. కేసీఆర్ ప్రభుత్వంలో బతుకమ్మ పండుగకు చీర ఇచ్చేవారు. ఇప్పుడు అది కూడా లేకపోయే.

– మంచాల అనూష, పడమటిగూడెం



నర్సింహాపురం బంజరలో బతుకమ్మ ఆడుకునే ప్రాంతంలో ఏర్పాటు చేయని లైట్లు

పూల పండుగ బతుకమ్మ మొదలై ఐదు రోజులవుతున్నా ఏర్పాట్లు చేయకపోవడంతో ఆడబిడ్డలు ఇబ్బందులు పడుతున్నారు. కనీసం గ్రామాల్లో బ్లీచింగ్ పౌడర్ కొనడానికి, లైట్లు బిగించడానికి నిధుల్లేని పరిస్థితి దాపురించింది. వేడుకలకు ఏర్పాట్లు చేయడానికి సీఎంకు మనసు రావడం లేదా? ఆడబిడ్డ వేడుకంటే గిట్టదా.. పట్టదా మన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి.. అని వారు ప్రశ్నిస్తున్నారు. బతుకమ్మ పండుగకు బీఆర్ఎస్ ప్రభుత్వం 18 ఏళ్లు నిండిన మహిళలకు కానుకగా చీర ఇచ్చేవారు. చీరకు బదులు కాంగ్రెస్ ప్రభుత్వం రూ.500 ఇస్తుందని చెప్పిన సీఎం ఆ ఊసే ఎత్తకపోవడంపై పెదవి విరుస్తున్నారు. బతుకమ్మ చీరలను రద్దు చేసిన్రు.. ఇప్పుడు బతుకమ్మ ఉత్స వాలను ఘనంగా చేసుకోవాల్సిన అవసరం లేదని చెబుతున్నారా.. అని ప్రశ్నిస్తున్నారు. నర్సింహులపేట మండలవ్యాప్తంగా బతుకమ్మ పండుగకు నిధులు లేకపోవడంతో పంచాయతీ కార్యదర్శులు తమ సొంత ఖర్చులతో గ్రామాల్లో విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయడంతోపాటు బ్లీచింగ్ పౌడర్‌కు సైతం ఖర్చు చేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేసీఆర్ సర్కారున్నప్పుడు ప్రత్యేక నిధులు కేటాయించడంతో పాటు గ్రామపంచాయతీ జనరల్ ఫండ్ నుంచి ఖర్చు చేసి బతుకమ్మ ఆడుకునేందుకు స్థలం, లైట్లు, సౌండ్‌బాక్స్‌లు ఏర్పాటు చేసేది. ఇప్పుడు నిధులు లేకపోవడంతో అరకొర వసతులు ఏర్పాటు చేయాల్సి వస్తుందని, విద్యుత్ లైట్లు, సౌండ్స్ కోసం సొంతంగా లేదా దాతలపై ఆధారపడాల్సి వస్తుందని నిట్టూరుస్తున్నారు. వసతులు ఏర్పాటు లేకపోవడంతో ప్రజలు నిలదీస్తున్నారని కార్యదర్శులు చెబుతున్నారు.



గత బీఆర్ఎస్ సర్కారు ఇచ్చిన బతుకమ్మ చీరెలు (ఫైల్)

---

# హామీలను గాలికొదిలేసిన కాంగ్రెస్

- ఆ పార్టీ పాలనలో ప్రజలు సంతృప్తిగా లేరు
- నెక్ట్స్ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే..
- ప్రణాళికా సంఘం మాజీ ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్



మాట్లాడుతున్న ప్రణాళికా సంఘం మాజీ ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్

పర్వతగిరి, అక్టోబర్5: కాంగ్రెస్ పార్టీ హామీలను గాలికొదిలేసిందని, ఆ పార్టీ పాలనలో ప్రజలు సంతృప్తిగా లేరని ప్రణాళికా సంఘం మాజీ ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్ అన్నారు. పర్వతగిరి మండలంలోని ఏనుగల్లు గ్రామంలో ఇటీవల మృతి చెందిన పాలికోజు శంకరయ్య కుటుంబాన్ని శనివారం ఆయన పరామర్శించారు. మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. కుటుంబానికి అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. గ్రామంలో కార్యకర్తలతో కొద్ది సేపు మాట్లాడారు. భవిష్యత్ బీఆర్ఎస్ పార్టీదేనని కార్యకర్తలు, శ్రేణులు ధైర్యంగా ఉండాలన్నారు. రాష్ట్రంలోని చెరువులు, కుంటల్లో సాగు నీరు సమృద్ధిగా ఉన్నాయంటే ప్రధానం కారణం కేసీఆర్ సారు ముందు చూపుతో తీసుకున్న గొప్పగొప్ప నిర్ణయాలేనన్నారు. అద్భుతమైన ప్రణాళికతో రైతాంగానికి వందల ఏళ్లు సాగు నీరందించేలా కాళేశ్వరం ప్రాజెక్టు డిజైన్ చేసి నిర్మించారని చెప్పారు. రానున్న రోజుల్లో సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. నెక్ట్స్ వచ్చేది మన బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, అందరికి అందుబాటులో అండగా ఉంటామని ఆయన కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ బోయినపల్లి యుగేంధర్‌రావు, మాజీ ఎంపీటీసీలు కోల మల్లయ్య, డాక్టర్ సాంబారు లింగమూర్తి, చిన్న మాధవరావు, సతీష్‌రావు, అశోక్, నాగరాజు, బాలరాజు, నర్సింగం, మోహన్, మాసాని వెంకట్, కుమారస్వామి, రామకృష్ణ, శ్రీనివాస్, అనిల్, రాజు, రమేశ్, వేణు పాల్గొన్నారు.

# తప్పుడు కుల ధ్రువీకరణ పత్రాల జారీపై విచారణ

- డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలనలో వెలుగులోకి..
- అభ్యర్థి ఫిర్యాదుతో కదిలిన అధికారులు

తొర్రూరు, అక్టోబర్ 5 : మహబూబాబాద్ జిల్లా తొర్రూరు పట్టణానికి చెందిన ఇద్దరు వ్యక్తులకు తప్పుడు కుల ధ్రువీకరణ పత్రాల జారీపై రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టారు. డీఎస్సీ-24 నియామకాల కోసం జిల్లా కేంద్రంలో చేపట్టిన సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌లో తప్పుడు కుల ధ్రువీకరణ పత్రాల జారీ వ్యవహారం వెలుగు చూసింది. శనివారం పట్టణంలో ఆర్ఐ బషీర్, రెవెన్యూ సిబ్బంది విచారణలో పాల్గొన్నారు. తొర్రూరులోని సాతాని సామాజిక వర్గానికి చెందిన ఇద్దరు అభ్యర్థులు బీసీ-ఏ కేటగిరీలో దాసరి కుల ధ్రువీకరణ పత్రాలను చూపారు. సాతాని సామాజిక వర్గం బీసీ-డీ కేటగిరీలోకి వస్తుందని, వారికి బీసీ-ఏలో ఎలా జారీ చేశారని వారికంటే ర్యాంకులో ముందున్న జోరిగె నాగరాణి డీఈవోకు ఫిర్యాదు చేశారు. స్పందించిన డీఈవో రాజేశ్వర్ సమగ్ర విచారణ జరపాలని తొర్రూరు తహసీల్దార్‌ను కోరారు. కాగా పట్టణానికి చెందిన ఇరువురికి 2023లో అప్పటి తహసీల్దార్ నాగేంద్రప్రసాద్ హయాంలో కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేసినట్లు తెలిసింది. దీనిపై ఆర్డీవో నర్సింగరావును వివరణ కోరగా ఈ వ్యవహారంపై విచారణ చేపడతామన్నారు. తహసీల్దార్ శ్రీనివాస్ మాట్లాడుతూ 2023లో సాతాని సామాజిక వర్గానికి చెందిన ఇద్దరికి బీసీ-డీ కుల ధ్రువీకరణ పత్రాల జారీ జరిగిందని, దీనిపై సమగ్ర విచారణ చేపట్టి నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు.

# పాకాల చివరి ఆయకట్టుకు నీరేదీ?

- అధ్వానంగా కాల్వలు.. ఎండుతున్న పంటలు
- ఆందోళనలో అన్నదాతలు.. పట్టించుకోని అధికారులు



కొత్తూరు శివారులో ఎండిపోయిన తుంగబంధం పంట కాల్వ, దుంపిల్లపాయ ప్రాంతంలో ఎండిపోతున్న పాకాల ఆయకట్టు పంటపొలాలు

ఖానాపురం, అక్టోబర్ 5: పంట కాల్వల నిండా గుర్రపుడెక్క, సిల్ట్ పెరిగిపోయి నీటి ప్రవాహానికి అడ్డుగా ఉండడంతో పాకాల చివరి ఆయకట్టుకు నీరందని పరిస్థితి దాపురించింది. పంట కాల్వలను శుభ్రం చేసి సక్రమంగా నీరందించకపోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 15 రోజులుగా చివరి ఆయకట్టుకు నీరందక పంటలు ఎండిపోతుండడంతో ఆందోళన చెందుతున్నారు. తుంగబంధం కాల్వ పారకం కొత్తూరు గ్రామ శివారు దుంపిల్లపాయ ప్రాంతంలో 300 ఎకరాల్లో, మండల పరిధిలోని రంగాపురం, చెన్నారావుపేట మండలాల సరిహద్దులోని గంగదేవి పాయ ప్రాంతంలో 300 ఎకరాల్లో రైతులు వరి పంటను సాగుచేస్తున్నారు. నాట్లు వేసినప్పటి నుంచి నేటి వరకు రైతులకు ఏనాడు పంట కాల్వల ద్వారా సక్రమంగా నీరందలేదు. వర్షాల మీదనే ఆధారపడి రైతులు పంటలను సాగు చేస్తున్నారు. 15 రోజుల నుంచి వర్షాలు తగ్గుముఖం పట్టడంతో దుంపిల్లపాయ ప్రాంతంలో 200 ఎకరాలో పంటలు ఎండిపోతున్నాయి. బోర్లు, బావుల మీద ఆధారపడి మరో 100 ఎకరాల్లో రైతులు ఎలాగోలా పంటలు పండించుకుంటున్నారు. పాకాల అంటేనే పంట కాల్వల ద్వారా సాగవుతుందనే నానుడి ఉంది. ప్రస్తుతం వర్షాలు, బావులు, బోర్లపై అధారపడాల్సిన పరిస్థితి తయారైందని రైతులు వాపోతున్నారు. దుంపిల్లపాయ ప్రాంతంలో తుంగబంధం కాల్వ పూర్తిగా ఎండిపోవడంతో రైతులు ఇరిగేషన్ అధికారులకు పలు సార్లు తమ గోడు విన్నవించుకున్నప్పటికీ పట్టించుకున్న దాఖలాలు లేవు. పంట పొట్టదశకు చేరుకుంటున్న ఈ సమయంలో నీరందక పంటలు ఎండిపోతుండడంతో రైతన్నలు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. అధికారులు తక్షణమే స్పందించి దుంపిల్లపాయ ప్రాంతంలోని పంటలకు నీరందించి ఆదుకోవాలని కోరుతున్నారు.

# అలుగు అక్రమ రవాణా

**ఎనిమిది మందిపై కేసు**

- భూపాలపల్లి డీఎఫ్‌వో వసంత వెల్లడి



అదుపులోకి తీసుకున్న నిందితులు

భూపాలపల్లి రూరల్, అక్టోబర్ 5 : అలుగు(పంగోలిన్) అక్రమ రవాణా చేస్తున్న ఎనిమిది మందిపై వన్యప్రాణి సంరక్షణ చట్టం కింద కేసు నమోదు చేసినట్లు జయశంకర్ భూపాలపల్లి డీఎఫ్‌వో వసంత తెలిపారు. శనివారం ఆమె తన కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. చెన్నైలోని వైల్డ్ లైఫ్ క్రైం కంట్రోల్ బ్యూరో సమాచారం మేరకు శుక్రవారం భూపాలపల్లి అటవీ రేంజ్ పరిధిలోని మేడిపల్లి టోల్‌గేట్ వద్ద అలుగును తరలిస్తున్న తాటి రాజ్‌కుమార్, ఎండీ నజీర్, ఎండీ అమ్జద్‌ను కొనుగోలుదారుల రూపంలో వచ్చిన అటవీశాఖ అధికారులు అదుపులోకి తీసుకొని హనుమకొండకు తరలించారు. శనివారం వారిని భూపాలపల్లి కార్యాలయంలో విచారించగా మరో ఐదుగురు గట్టు సమ్మయ్య, తాళ్లపల్లి శంకర్, ఊరుగొండ దేవన్న, పెద్ది లక్ష్మయ్య, నరివెద్ది వెంకటనారాయణ ప్రమేయం ఉన్నట్లు తేలింది. ఐదుగురిలో సమ్మయ్య, వెంకటనారాయణను అదుపులోకి తీసుకోగా, ముగ్గురు పరారీలో ఉన్నా రు. భూపాలపల్లి ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ సెలవులో ఉన్నందున ఐదుగురు నిందితులను ములుగు జిల్లా ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చారు. కాగా, సొంత పూచీకత్తుపై నిందితులకు బెయిల్ మంజూరు చేసినట్లు వసంత తెలిపారు. ఆమె వెంట భూపాలపల్లి రేంజ్ అధికారి నరేశ్, సిబ్బంది ఉన్నారు.



నాణేలను చిరు వ్యాపారులకు అందజేస్తున్న ఎస్బీఐ అధికారులు

## రూ.10 నాణేలు చెల్లవనే అపోహలు నమ్మొద్దు

గిర్మాజీపేట, అక్టోబర్ 5 : రూ.10 నాణేలు ఇంకా చలామణిలో ఉన్నాయని ఇవి చెల్లవు అనే అపోహలు వ్యాపారులు, ప్రజలు నమ్మవద్దని ఎస్బీఐ జీఎం ప్రకాశ్‌చంద్రబరోరు స్పష్టంచేశారు. శనివారం ఆయన వరంగల్ జేపీఎన్ రోడ్‌లోని స్టేట్ బ్యాంక్ ప్రధాన శాఖలో డీజీఎం గన్‌శ్యామ్ సోలంకి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. చిరు వ్యాపారులు నాణేలు చెల్లట్లేదంటూ దుష్ప్రచారం చేయడం తగదన్నారు. అనంతరం రూ.10 నాణేలు అందించారు. ఎస్బీఐ నెట్‌వర్క్-1 జీఎం రవికుమార్‌వర్మ, ప్రధాన శాఖ మేనేజర్ నరేంద్రకుమార్, ఏజీఎంఎస్ జీ శంకర్, అబ్దుల్‌రహమాన్, జితేంద్రకుమార్‌శర్మ పాల్గొన్నారు.

# పర్యాటకులూ.. మొక్కలు జాగ్రత్త!

- సుడిగాలికి నేలకూలిన చెట్లను చూసేందుకు వస్తున్న ప్రజలు
- పెరిగే మొక్కలు, వన్యప్రాణులపై పడుతున్న ప్రభావం




ధ్వంసమైన అడవిని పరిశీలిస్తున్న పర్యాటకులు


తాడ్వాయి, అక్టోబర్ 5 : ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని మేడారం అడవికి పర్యాటకులతో ముప్పు వాటిల్లనుంది. సుడిగాలి బీభత్సానికి ఈ అడవిలోని దాదాపు 500 ఎకరాల్లో వందల ఏళ్ల వయసున్న భారీ వృక్షాలు నేలకూలిన విషయం తెలిసిందే. జరిగిన నష్టాన్ని అంచనా వేసేందుకు అటవీ శాఖ అధికారులు 200 మందితో సర్వే నిర్వహిస్తున్నారు. అయితే కూలిన చెట్లను చూసేందుకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు, విద్యార్థులు, పర్యాటకులు తరలివస్తున్నారు. నిత్యం వందల సంఖ్యలో వస్తున్న పర్యాటకులు అత్యుత్సాహంతో అడవి లోపలికి వెళ్తుండడంతో ప్రస్తుతం పెరుగుతున్న మొక్కలతో పాటు వన్యప్రాణులకు ముప్పు పొంచి ఉన్నట్లు వన ప్రేమికులు ఆరోపిస్తున్నారు. అయితే ప్రస్తుతం కొత్తగా పెరుగుతున్న మొక్కల విషయమై అటవీ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని, పర్యాటకులను నియంత్రించడం లేదని అంటున్నారు. కోట్లాది రూపాయలతో అడవిని పెంచేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్న అధికారులు సహజ సిద్ధంగా పెరిగే మొక్కలపై దృష్టి పెట్టాలంటున్నారు. ధ్వంసమైన అడవిని రోడ్డుపై నుంచి మాత్రమే చూసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్ మృతుల్లో ఆశన్న?

- మావోయిస్టు కేంద్ర కమిటీ నాయకుడు మృతి చెందినట్లు సోషల్ మీడియాలో వైరల్
- అధికారికంగా సమాచారం లేదన్న పోలీసులు



ఆశన్న ఇల్లు ఉన్న స్థలం



ఆశన్న(ఫైల్)

వెంకటాపూర్, అక్టోబర్ 5: శుక్రవారం ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో వెంకటాపూర్ మండలం నర్సింగాపూర్ గ్రామానికి చెందిన మావోయిస్టు కేంద్ర కమిటీ నాయకుడు తక్కళ్లపల్లి వాసుదేవారావు అలియాస్ ఆశన్న మృతిచెందినట్లు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఎన్‌కౌంటర్‌లో 40మంది మావోయిస్టులు మృతిచెందగా, అందులో ఆశన్న ఉన్నట్లు వాట్సాప్‌లో చక్కర్లు కొడుతోంది. ఈ విషయమై ఎస్సై సతీశ్‌ను వివరణ కోరగా ఆశన్న మృతిపై అధికారికంగా ఎలాంటి సమాచారం లేదన్నారు. కాగా మాజీ మంత్రి ఎలిమినేటి మాధవరెడ్డి హత్య కేసులో ఆశన్న ప్రధాన నిందితుడిగా, ప్రస్తుత ఏపీ సీఎం నారా చంద్రబాబునాయుడు, మాజీ సీఎం జనార్దన్‌రెడ్డిలపై జరిగిన దాడుల్లో ప్రధాన పాత్ర ఉన్నట్లు గతంలో పోలీసులు ప్రకటించారు.